www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 2 ఆగస్టు 2024

5

తిరుపతి



కందిపప్పు లేనట్టే..!

- చక్కెరదీ అదే పరిస్థితి..
- ఎండియుల కొనసాగింపుపై సందిగ్ధత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుదారులకు ఏడాదికి పైగా రాయితీ కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. రెండు నెలలుగా చక్కెర ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టు నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార సరుకులను అందించాలని నిర్ణయించిన టెండర్ల ప్రక్రియలో జాప్యం కావడంతో ఈసారి అన్ని సరుకులూ అందే పరిస్థితి కనిపించడం లేదు. అర్బన్‌లో బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వమన్నారు. రూరల్ ప్రాంతాల్లో కేవలం బియ్యం మాత్రమే అందించనున్నారు. సరుకుల పంపిణీపై జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2488 రేషన్ షాపులు ఉన్నాయి. 12 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. సుమారు 638 ఎండియు వాహనాలు ఉన్నాయి. బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర అందిస్తారని అంతా భావించినా జిల్లాకు సరుకులు కాలేదు. పౌరసరఫరాలసంస్థ రాష్ట్ర ఉన్నతాధికారులు టెండర్లను ఆహ్వానించినా సకాలంలో పూర్తి కాలేదని తెలుస్తోంది. దీంతో ఎప్పటిలాగానే కార్డులో ఎంతమంది సభ్యులు ఉంటే అన్ని కేజీల బియ్యం ఇవ్వనున్నారు. అర్బన్ ప్రాంతంలో మాత్రం బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వనున్నారు.

ప్రతి కార్డుపై కేజీ కందిపప్పు..

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండియు వాహనాల ద్వారా గతంలో రాయితీపై ప్రభుత్వం కేజీ రూ.67లకే కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్లో కందిపప్పు ధర అంతకంతకూ పెరిగిపోయింది. ప్రస్తుతం కందిపప్పు కేజీ ధర రూ.180 నుంచి 200లకు చేరింది. ఇక చక్కెర పరిస్థితీ అలానే ఉంది. రాయితీపై కేజీ పంచదార రూ.17లకే పేదలకు ఇవ్వాల్సి ఉంది.. ఇప్పుడు మార్కెట్లో రూ.24కు పెరిగి రూ.41కి చేరింది.

ఎండియుల కొనసాగింపుపై సందిగ్ధత...

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను 2021, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. రేషన్ డోర్ డెలివరీ కోసం ప్రభుత్వం రూ.5.83లక్షల విలువైన వాహనాలను అందించింది. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు జిల్లాలో 422 మంది ఆపరేట్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్లు తోలుత ప్రభుత్వం రూ.16వేలు వేతనంగా నిర్ణయించింది. వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం ఈ-పాస్ మిషన్లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని అప్పట్లో వారు ఆందోళనకు దిగడంతో వేతనాన్ని రూ.21వేలకు పెంచింది. రేషన్ వాహనానికి సమకూర్చిన రుణానికి వాయిదా సొమ్ముగా రూ.3వేలను జమ చేసుకుంటోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఈ వ్యవస్థను రద్దు చేసి పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికిప్పుడే దీన్ని రద్దు చేసే అవకాశం ఉండకపోవచ్చు అని అధికారులు భావిస్తున్నారు. ఎండియు వ్యవస్థ నిర్వహణకు గతంలోనే బడ్జెట్ కేటాయింపులు చేసిన నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగించవచ్చు అనే అంచనా ఉంది. అదేవిధంగా బియ్యం మూడు కేజీలను తగ్గించి దాని స్థానంలో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

97 శాతం పింఛన్లు పంపిణీ

- లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు..
- పింఛన్ల పంపిణీని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమ పాలన దిశగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసి పేదవారికి ఆసరాగా నిలుస్తుందని, ఎక్కడ చూసినా అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి ఉదయాన్నే పెన్షన్లు తమకు ఇస్తున్నారని ప్రభుత్వం పట్ల పెన్షన్ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం ఏర్పేడు మండలం ఆమందూరు గ్రామపంచాయతీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. మండలంలోని అన్ని గ్రామాలలో 100శాతం పెన్షన్ల పంపిణీ నేడే పూర్తి చేయాలని, పర్యవేక్షించాలని ఎంపీడీవో ఏ.గిడ్డయ్యకు సూచించారు. పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మైనారు పొన్నారావు, సర్పంచ్ బాల గురునాథ్, ఈఓఆర్‌డి రమణ ప్రసాద్, జడ్పిటిసి తిరుమలయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

తిరుపతిలో..

వెంకటగిరి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్లను జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే పంపిణీ నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంను పాఠశాల విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. అన్న క్యాంటీన్ పనులు 5 నాటికి పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఎంపీపీ తనూజా రెడ్డి, వెంకటగిరి మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇంఛార్జి తహశీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

రామచంద్రపురం/ చంద్రగిరి: గురువారం నియోజకవర్గంలోని దుర్గసముద్రం, దేసూరుకండ్రిగ, అరిగిలవారిపల్లి, దామలచెరువు గ్రామ సచివాలయాలపరిధిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. ఎన్.చిన్నబాబు, సురేష్ నాయుడు, ఉమాపతి నాయుడు, మునిశేఖర్ రాయల్, సుబ్రహ్మణ్యం యాదవ్, ఎం.తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు అందజేయాలి: కమిషనర్

తిరుపతిటౌన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సకాలంలో అర్హులకు అందజేయాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్, రాజీవ్ గాంధి కాలనీ, ఎమ్మార్ పల్లె, ఐ.ఎస్.మహాల్, నెహ్రూ నగర్, మరికొన్ని ప్రాంతాల్లో ఫించన్ల పంపిణి జరుగుతున్న ప్రాంతాలను ఉదయం 6 గంటల నుండే కమిషనర్ మౌర్య స్వయంగా పరిశీలించి తగు సూచనలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా 24వ డివిజన్ ఇందిరానగర్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, బిజెపి నాయకులు వరప్రసాద్ సమక్షంలో జరుగుతున్న ఫించన్ల పంపిణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

గూడూరు టౌన్: పట్టణంలోని 15వ వార్డులో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, నాయకులు లబ్ధిదారులకు పెన్షన్‌దారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు వార్డుల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలను పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రవీణ్, సాయి, మునిగిరీష్, గోపాల్ రావు పాల్గొన్నారు. గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో టీడీపీ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.



గూడూరులో..

బిఎన్‌కండ్రిగ: మండలంలోని కారణిమిట్ట సర్పంచ్ కె.పద్మమ్మ అధ్యక్షతన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పింఛన్లు అందించారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు, తహసీల్దార్ చంద్రబాబు, నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కార్తీక్ నాయుడు, కన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

కెవిబిపురం: మండలంలోని కస్తూరిపురం ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు.

తిరుపతి(మంగళం): నగర పరిధిలోని 21వ డివిజన్లో టిడిపి బీసీ శాలివాహన పార్లమెంటు అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు అందించారు. ఉమామహేశ్వర్, గిరిజ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్స్ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కోట: రోజురోజుకు మట్టి, ఇసుక, గ్రావెల్స్ అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిపగలు తేడా లేకుండా నిరంతరం అక్రమంగా తరలిస్తున్నారు. స్థానిక ప్రజలు గృహనిర్మాణాలకు అవసరమైన ఇసుకను తోలుకోవాలంటే ఇబ్బందులు పడక తప్పవని పరిస్థితి. ప్రస్తుతం సామాన్యులు ఇసుకను తోలుకోవాలంటే ఎద్దుల బండిలో తోలుకోవల్సి ఉంటుంది. కానీ బడా నాయకులు మాత్రం స్వర్ణముఖి నదితోపాటు పలు చెరువుల నుంచి జెసిబిలు పెట్టి భారీ సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తూ లక్షల రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను తరలిస్తే రూ.5నుంచి 8వేలకు అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

కోట మండలంలోని నెల్లూరుపల్లి, కొత్తపాలెం, కర్లపూడి, పుచ్చలపల్లి, ఉత్తమ నెల్లూరు తదితర చోట్ల నుంచి ఇసుకను రాత్రి సమయంలో తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గత పది రోజుల నుంచి కోట మండలంలోని ఇసుకను, చెరువు మట్టిని, గ్రావెల్‌ను అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండానే తరలిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల మౌనం పలు అనుమానాలకు తావిస్తోందని, బహిరంగంగా అక్రమ రవాణా జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో తెలపాలన్నారు.

బుధవారం మండలంలోని నెల్లూరుపల్లి, కొత్తపాలెం, పెన్నక్కచెరువులో జెసిబిల సాయంతో 20 ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలించారు. గురువారం కూడా మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తుంటే సమాచారం అందుకున్న పోలీసులు అడ్డుకోవడంతోపాటు మట్టి త్వవకాలను నిలిపివేయడం జరిగింది. మండలంలోని రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటే మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ త్వవకాలను అడ్డుకోవచ్చు అని గ్రామస్తులు చెబుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

- మల్లికార్జునరావు, డిప్యూటీ తహశీల్దార్



చట్టబద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తున్నట్టు మా దృష్టికి రాలేదు. ఒకవేళ అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటాం.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్పీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఆర్పీలు కోరారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో మాతమ్మ ఆధ్వర్యంలో ఆర్పీలు ఆయనతో భేటీ అయ్యారు. తమ సమస్యలను ఎమ్మెల్యేకి చెప్పుకున్నారు. ఏడాడిలో ఆరుసార్లు ఎస్ఎల్ఎఫ్ లెక్కలు చూసి జనరల్ బాడీలో ఆమోదించినా తిరిగి అధికారులు లెక్కలు అడుగుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆర్పీలు ఫిర్యాదు చేశారు. కొంత మంది ఆర్పీల లాగిన్స్ హోల్డ్ చేశారని వీటిని పునరుద్ధరణ చేయించాలని వారు కోరారు. అలాగే మహిళా మార్ట్‌లో నెలనెలా ఒక్కో ఆర్పీ రూ.50వేల సరుకులు కొనాలని ఒత్తిడి చేస్తున్నారని సభ్యులు మాత్రం కొనుగోలుకు ఇష్టపడటం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలో మెప్మా అధికారులు, ఆర్పీలతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అన్ని విభాగాలకు హోంగార్డులు కీలకం

క్రమశిక్షణతో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలి

రాయలసీమ రీజన్ హోంగార్డు కమాండెంట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: హోంగార్డులు పోలీస్ శాఖలోని అన్ని విభాగాలకు ఎంతో కీలకమని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, సమర్ధవంతంగా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని రాయలసీమ రీజన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా హోంగార్డ్స్ పరేడ్ తనిఖీ.. దర్బార్‌ను గురువారం నిర్వహించారు. రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ తిరుపతి జిల్లా హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేసి, దర్బార్ నిర్వహించి హోంగార్డ్స్ సమస్యలను తెలుసుకుని జిల్లా ఎస్పీ దృష్టికి తీసికెళ్లి పరిష్కారం చూపుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉండాలని, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సెంట్రల్ గవర్నమెంట్ ఇన్సూరెన్స్ పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై పాలసీలను ఎల్లప్పుడూ రెన్యువల్ చేసుకుంటూ ఉండాలన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని బాగా మెరుగుపరుచుకోవాలని, పలు మెళకువలు సూచించారు. ప్రయాణాలలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్‌లు రెన్యువల్ అవుతున్నాయా లేదా చూసుకొంటూ ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. పరేడ్ అనంతరం హోంగార్డులను ప్రోత్సహిస్తూ తిరుపతి జిల్లాలో ఇటీవల కాలంలో పదోన్నతి పొందిన 73 మంది హోంగార్డులకు, హోంగార్డ్ డీఎస్పీ చిరంజీవి వితరణ చేసిన ఆర్టికల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతల రాజు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రుయాలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఎస్వీ వైద్య కళాశాల రుయా ఆసుపత్రి, చిన్న పిల్లల విభాగంలో 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను రుయా సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు గురువారం ప్రారంభించారు. ఈనెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా చిన్నపిల్ల ఆసుపత్రి విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ జి.రవి ప్రభు మాట్లాడారు. తల్లిపాలు ఆవశ్యకతను ముందుగా వైద్యులకు, వైద్య విద్యార్థులకు, అవగాహన కల్పించినట్లయితే, ప్రజల్లోకి ఈ విషయం సులభంగా తీసుకెళ్లడానికి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వల్ల లెక్కలేనని ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇది శిశువుల పోషక అవసరాలను తీర్చడానికి సహజంగా రూపొందించబడింది. చనుబాలు ఇవ్వడం అత్యంత అవసరమని, ఇది పలు ప్రయోజనాలను కల్పిస్తుందన్నారు. శిశువుకు దాదాపు అన్ని పోషకాహార అవసరంలో సహాయపడుతుందన్నారు. మీ బిడ్డను తీవ్రమైన వ్యాధులు, ఇన్ఫెక్షన్ నుండి రక్షిస్తుందని, బిడ్డ ఆకలితో ఉన్నప్పుడు అది తక్షణమే అందుబాటులో ఉంటుందన్నారు. తల్లిపాలు తల్లి- బిడ్డ మధ్య భావోద్యేగ బంధాన్ని పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. తల్లిపాలు ప్రతి బిడ్డకు ఎంతో అవసరం అని తెలిపారు. కార్యక్రమంలో చిన్న పిల్లల పూర్వ విభాగాధిపతి డాక్టర్ ఆరుముగం, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, చిన్నపిల్లల తల్లులు, వారి సహాయకులు, ఎస్వి వైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్ పాల్గొన్నారు.

'ఆకాష్ ఆంతే-2024' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఆకాష్ జాతీయస్థాయి స్కాలర్షిప్ పరీక్ష ఆంతే-2024కు గోడ పత్రికను గురువారం ఆకాష్ తిరుపతి కేంద్రంలో సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు లోని ఆ సంస్థ కార్యాలయంలో నీట్, జేఈఈ కోర్సులలో చేరే అభ్యర్థులకు నిర్వహించే పోటీ పరీక్ష ఆంతే- 2024 లాంఛనంగా ప్రారంభిస్తూ ఆకాష్ తిరుపతి అసిస్టెంట్ డైరెక్టర్ కెఎస్ఆర్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ రీజనల్ సేల్స్‌హెడ్ నిశాంత్ మిశ్రా, బ్రాంచ్ హెడ్ మోడెం నరసింహులు గతంలో స్కాలర్షిప్ పొందిన విద్యార్థులను పరిచయం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ జాతీయ స్కాలర్‌షిప్ పరీక్ష (ఆంతే) అక్టోబర్ 19 నుండి 27 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరుగుతుందన్నారు. 100శాతం వరకు స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. 7,9 తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులకు, 11, 12 (ఇంటర్మీడియట్) తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఇందులో అత్యుత్తమంగా మొదటి ఐదు స్థానాలు సాధించిన ఐదు మంది విద్యార్థులకు కెన్నెడీ స్పేస్ సెంటర్, ఫ్లోరిడా, యుఎస్ఏకు 5-రోజుల టూర్‌కు మొత్తం ఖర్చుతో కూడిన పర్యటన అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. గత సంవత్సరం, 11.8 లక్షల కంటే ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసి రికార్డు సృష్టించారు. చాలా మంది టాపర్లు (నీట్, యుజి, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్) నిలిచారని తెలిపారు. ఈ జాతీయ పరీక్షకు సంబంధించి ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో ఆంతే.ఆకాష్.ఏసి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు, వారికి సమీపంలోని ఆకాష్ బ్రాంచ్ కార్యాలయం కూడా సంప్రదించవచ్చని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.125 కోట్లు

ప్రజాశకి- తిరుమల

తిరుమల శ్రీవారి హుండీకి భారీ ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 2022 మార్చి నుంచి శ్రీవారి హుండీ ఆదాయం రూ.100కోట్ల మార్క్‌ను అందుకుంటోందని ఈ సందర్భంగా టీటీడీ పేర్కొంది. 29 నెలలు వరుసగా రూ.100 కోట్ల మార్క్‌ను అందుకుంటోంది. ఇక జులై నెలకు గాను శ్రీవారి హుండీ ఆదాయం రూ.125 కోట్లు సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. శ్రీవారి సన్నిధికి నిత్యం భక్తులు రాకపోకలు సాగుతుంటాయి. ఒక్క ఏపీ నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి కూడా ఇక్కడికి భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటారు. భక్తులు తమ మొక్కులను కానుకల రూపంలో చెల్లించుకోవడం ఆనవాయితీ. శ్రీవారి హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు టీటీడీ పేర్కొంది. 2020లో కరోనా మహమ్మారి కారణంగా ఆలయాన్ని మూసివేసారు. ఆ తర్వాత భక్తుల కోసం ఆలయ తలుపులు తెరిచారు. 2022 మార్చి నుంచి తిరుమల స్వామివారి హుండీ ఆదాయం రూ.100 మార్క్‌ను అందుకుంటూనే ఉందని, ఎక్కువశాతం రూ.120 కోట్లను కూడా రాబట్టిందని అధికారులు చెబుతున్నారు. ఇక, జులై నెలకు గాను రికార్డు స్థాయిలో రూ.125 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, రేపు డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు.

టిటిడి విజిలెన్స్ వింగ్ వీజీవోగా బాధ్యతలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల టిటిడి విజిలెన్స్ వీజీవోగా ఎస్వీవీ రామ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లాలో డిఎస్‌పిగా పనిచేసిన రామ్‌కుమార్‌కు సమర్థవంతమైన అధికారిగా పేరుంది. మదనపల్లికి వరదల వచ్చిన సమయంలో అప్పట్లో పలువురి ప్రాణాలు కాపాడారు. విజిలెన్స్ కార్యాలయంలో భాద్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

పేదప్రజలకు ఆశచూపి మోసం చేస్తున్నారు..

ప్రచారాల్లో చంద్రబాబును మించిన వారు లేరు

విలేకరుల సమావేశంలో నారాయణస్వామి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదప్రజలకు పథకాలను ఆశ చూపి అధికారం చేజికిచ్చుకొని మోసం చేయడానికి చూస్తున్నారని మాజీ డిప్యూటీసిఎం కళత్తూరు నారాయణస్వామి ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువ ఇస్తామంటూ సూపర్ సిక్స్ పథకాలని ఆశ చూపి నేడు అనుభవం కలిగిన వ్యక్తిగా చెప్పుకునే చంద్రబాబు నాయుడు భయమేస్తోందని అసెంబ్లీ సాక్షిగా అనడం మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారనడానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తిగా చెప్పబడే చంద్రబాబు నాయుడు అధికారం కోసం ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను ఆశ చూపి నేడు జగన్ పాలనను బూచిగా చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రచారాలు చేయడంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ను ఎవరు మించి పోలేరన్నారు. పేద వర్గాల అభ్యున్నతి కోసం విద్యా వ్యవస్థలో, ఆరోగ్య వ్యవస్థలో జగన్మోహన్ రెడ్డి చేసిన సంస్కరణలను మార్పు చేయొద్దని సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

గురుకుల సీట్ల అమ్మకాలపై గర్జించిన విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బాలికల ఎస్‌సి గురుకుల పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు సీట్ల విక్రయాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు విద్యార్థులతో కలిసి పాఠశాల గేటు వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి మురళి, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగార్జున, ఏఐవైఎఫ్ నాయకులు మురళి మాట్లాడుతూ స్థానిక బి ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏ తరగతి కైనా సీట్లు కేటాయించాలంటే డబ్బులు చెల్లించడం రివాజుగా మారిందని పదవ తరగతి 10వేల నుండి 20వేలు, ఇంటర్ ఫస్టియర్‌కు 30వేలు రూపాయలు చెల్లిస్తే సీటు ఖరారు చేసే తతంగం గత 20 సంవత్సరాలుగా ఆధారాలతో సహా బుధవారం వెలుగులోకి రావడం ఖండించదగ్గ విషయమని తెలిపారు. తమ పిల్లలకు సీటును ఆశించిన తల్లిదండ్రుల నుండి తమకు అందిన ఆధార పూరిత సమాచారం మేరకు డాటర్ ఆఫ్ నాగరాజు డిఎన్ కండ్రికకు చెందిన ఈ బాలిక తల్లి వద్ద నుండి ఫస్ట్ ఇయర్ బైపిసి సీటు కోసం ప్రిన్సిపల్, గత డిసిఓలు వాచ్‌మ్యాన్ మధ్యవర్తిగా 20వేల రూపాయలు ఫోన్ పే ద్వారా జూన్ నెలలో చెల్లించినట్లు నవ్య శ్రీ తల్లి సుజాత తెలిపారన్నారు. జులై ఆఖరి వరకు తమ పాపకు సీటు ఖరారు కాకపోవడంతో వాచ్‌మ్యాన్‌ను గట్టిగా ప్రశ్నించగా డబ్బుల ఇవ్వకపోగా 'మీ డబ్బుల నా దగ్గర లేదు..పై అధికారులు ఇద్దరికీ పంచి పెట్టానని వాచ్‌మ్యాన్ తమకు తెలిపినట్లు వివరించారు. మరో రెండు రోజులు టైం ఇస్తే సీటు కన్ఫామ్ చేస్తానంటూ వాచ్‌మ్యాన్ హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీటు కన్ఫామ్ కాకపోవడంతో తనను మోసగించారని నవ్యశ్రీ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తూ తనకు న్యాయం చేయా లని తమను ఆశ్రయించి నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. టి అభిజ్ఞ వారి తల్లిదండ్రుల నుండి 15 వేల రూపాయలు ఫోన్‌పే ద్వారా వాచ్‌మ్యాన్‌కు చెల్లించి నట్లు తెలిపారు. గత సంవత్సరం కన్నవరం గ్రామానికి చెందిన డి కీర్తన వద్ద , ఎన్ జెస్సికా ఏడవ తరగతి సీటుకు చెరో 25వేలు, టి థెరీసా వద్ద 9వ తరగతి సీటుకు రూ.20 వేలు అటెండర్ ద్వారా తీసుకుని డిసిఓ ద్వారా సీట్లు ఇప్పించారని తెలిపా రు. ఫోన్ పే ట్రాన్సక్షన్స్ తమ వద్ద ఉన్నట్లు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ అవినీతి చర్య బాలికల విద్యా హక్కు చట్టం ఉల్లంఘనగా పేర్కొంటూ అంబేద్కర్ గురుకుల పాఠశాల సిబ్బందిపై సమగ్ర విచారణ చేపట్టి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి సంఘ నాయకులు బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నూతన డిసిఓ పద్మజను వివరణ కోరగా ఈ సంఘటనను తెలుసుకున్న వెంటనే గురుకుల పాఠశాలకు చేరుకుని అడ్మిషన్ కమిటీ సభ్యులు, అటు సెక్యూరిటీ గార్డ్ సంగీతను విచారించి స్టేట్‌మెంటు తీసుకున్నట్లు తెలిపారు. ఈ అవినీతికి పాల్పడ్డ గురుకుల పాఠశాల యాజమాన్యం పై , సిబ్బందిపై మరింత సమగ్ర విచారణ చేపట్టి ప్రక్షాళన చేయనున్నట్లు తెలిపారు.

ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

స్కూలు భవన నిర్మాణానికి భూమి పూజ

స్కూలు భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం వికృతమాలలో గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూలు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా నియోజక వర్గంలో ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎంఆర్‌పిఎస్ సంబరాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్దత కల్పిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పునివ్వడంపై పట్టణంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈర్ల రాజా ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు మాడ వీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కృషికి సుప్రీం తీర్పులో ఫలితం దక్కిందని రాజా అన్నారు. మాదిగల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణ ఎంత ముఖ్యమో ఆయన వివరించారు.

క్యాంపస్ : ఎస్సీ వర్గీకరణ దాదాపు 30 ఏళ్ల పోరాటానికి అంతిమ తీర్పును సుప్రీంకోర్టు ఇవ్వడంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాటం పూర్తయిందని ఆ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మాదిగ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్, దాని అనుబంధ కార్యకర్తలు డప్పులతో, బాణసంచా పేల్చి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అంబేద్కర్‌కు పూలమాలలు వేసి న్యాయం గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వైకే విశ్వనాథ్ మాదిగ, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు, సీనియర్ నేత పులి కుంట్ల గోపి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరిపోగు వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు వేలూరు రాజేంద్ర మాదిగ, అధ్యాపకులు అంజన్ బాబు, మధు, కిషోర్, రాంప్రకాష్, ఎంఎస్ ఎఫ్ సీనియర్ నాయకులు డాక్టర్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థుల్లే భావి భారత పౌరులు: ఎమ్మెల్యే

విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నేటి విద్యార్థులే భావి భారత పౌరులు అని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో, ఎస్ ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి గోపాల్ రెడ్డి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఇంటర్ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంస్థలలో చదివి ఉత్తమ భవిష్యత్తు పొంది భావి భారత పౌరులు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎస్ ధనపాల్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, మాజీ ఎంపిపి గంజి మాదవయ్య, ఏలుమలై అమ్ములు, జనసేన ఇన్‌ఛార్జి మెరుపుల మహేష్, ప్రసాద్ నాయుడు, కౌన్సిలర్ కేశవాచారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, నగరి నియోజకవర్గ పార్టీ నాయకులు పుత్తూరు మున్సిపల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సమస్యల పరిష్కారంపై పోరాడుతున్న సిపిఎం నాయకుల పై ఆరోపణలు చేయడం సరికాదని సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. గురువారం సిపిఎం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని జక్కా వెంకయ్య నగర్‌లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం గత కొన్ని రోజుల నుండి ఆందోళన చేస్తున్నామన్నారు. పక్కనే ఉన్న ఎస్‌బిఐ కళాశాల యాజమాన్యం కెళంగిడి అక్రమ నిర్మాణాలు చేస్తున్న నిరుపేద ప్రజలను ఇబ్బంది పెట్టేలా మురికి నీరు వెలుపలికి పోనివ్వకుండా అడ్డంగా గోడను కట్టడంతో ప్రజల పక్షాన నిలబడిన సిపిఎం నాయకులపై నోటీసుల్లో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో సిపిఎం నాయకులపై, కార్యకర్తలపై బురద జల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, నిరుపేదల భూములు కబ్జా చేయడాన్ని నిరసిస్తూ పేదల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న సిపిఎం నాయకులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పి శ్రీనివాసులు, పుట్టా శంకరయ్య, బి రమణయ్య, సురేష్, పాముంజ మణి, అడపాల ప్రసాద్, ముత్యాలయ్య, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఎంఆర్‌ల సంఘం అధ్యక్షుడిగా జయచంద్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎంఆర్‌ల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ఎంఆర్ సంఘం నూతన అధ్యక్షులుగా జి జయచంద్ర, ఉపాధ్యక్షులుగా వి జగదీష్, సెక్రటరీగా బి సిద్ధయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆ సంఘం మీడియా కోఆర్డినేటర్ దొరబాబు తెలిపారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బోధనేతర సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు శ్రీధర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్ఎంఆర్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఇతర సభ్యులు కలిసి కట్టుగా ఉండి స్నేహపూర్వకంగా సమస్యలను సాధించుకోవాలన్నారు. బోధనేతర సంఘం ఎప్పుడూ సహాయ, సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఆర్ సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ షాపులు తొలగించండి: జనసేన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గత ప్రభుత్వ హయాంలో పలువురు అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులను తొలగించి ఆటో స్టాండులో స్థలం కేటాయించి న్యాయం చేయాలని కోరుతూ జనసేన అనుబంధ సంఘం ఆటో యూనియన్ నాయకులు రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రేపు విదేశీ విద్యపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఈ నెల 3న గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఫెయిర్-2024ను తిరుపతి బస్టాండు సమీపంలోని కెన్సెస్ హోటల్లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్ వ్యవస్థాపక సిఈఓ నరసింహ బందార్ల గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ విదేశాల్లో విద్యను అభ్యసించ దానికి అవసరమైన అన్ని సమాచారాలను తాము అందించి, ఉపాధి అవకాశాలను అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రెండు సంవత్సరాల వ్యవధిలో 1200 మంది విద్యార్థులను విదేశాల్లో విద్యకోసం తగిన తర్ఫీదు అందించి పంపామన్నారు. విదేశీ విద్యకు సందేహాలు వస్తాయని, ఎంచుకున్న కోర్సు, దేశం, అక్కడి పరిస్థితులపై ఆందోళనలు వస్తాయని ఇలాంటి సందేహాలను తమ ఐసిసి (ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్)లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇంటిగ్రేటెడ్ పోర్టల్ ద్వారా అవసరమైన సమాచారాన్ని తెలిపామన్నారు. ఈ కార్యకమంలో ఐసిసి గ్లోబల్ హెడ్ సిరీష్ పాల్గొన్నారు.

ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ పాత టెండర్ రద్దు

కొత్త టెండర్ దక్కించుకున్న గీత

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో పాత మున్సిపాల్టీ కార్యాలయానికి సమీపంలో ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ పాత టెండర్ రద్దు అయింది. కొత్తగా వై గీత కొత్త టెండర్ చేజెక్కించుకుంది. ఈ టెండర్ రావడానికి టిడిపి నేత, ఏపీ యాదవ మహాసభ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ యాదవ్ కీలకపాత్ర వహించారు. అంతే కాకుండా ప్రియదర్శిని మార్కెట్‌కు వచ్చే ప్రజలకు, వినియోగదారులకు, షాపు యజమానులకు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ కొత్త టెండర్ రావడం, శంకర్ యాదవ్ తాగునీటి సదుపాయం కల్పించిన నేపథ్యంలో గురువారం కూరగాయలు మార్కెట్లో తాగునీటి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూరగాయల మార్కెట్లో వచ్చే ప్రజలకు ప్రతి ఒక్కరికి తాగడానికి గుక్కెడు మంచినీరు ఇవ్వకపోగా, వినియోగదారులను, షాపు యజమానులను ముప్ప తిప్పల పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారని బాధపడ్డారు. కొత్త టెండర్ రావడానికి మార్కెట్లో తాగునీటి సదుపాయాన్ని కల్పించిన టిడిపి నేత, ఏపీ యాదవ మహాసభ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ యాదవ్ ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవును తెలుగుతమ్ముళ్లు, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు, మహిళలు, శంకర్ యాదవ్ సేన నగర ప్రజలు మార్కెట్ లోని షాపు యజమానులు, వినియోగదారులు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకర్ యాదవ్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు చిన్నంగారి రమణ, టిడిపి నేతలు అన్నా రామచంద్రయ్య యాదవ్, 48 వ వార్డు కార్పొరేటర్ అనిత యాదవ్ పాల్గొన్నారు.

మహబూబ్ బాషాకు జనసేన కండువా కప్పుతున్న ఇన్‌ఛార్జి వినుత కోటా

మహబూబ్ బాషా జనసేనలో చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మేజర్ పంచాయ తీ ఐదవ వార్డు సభ్యులు, వైసిపి సీనియర్ నేత వురిమిల్ల మహబూబ్ బాషా బుధవారం జనసేనలో చేరారు. ఆయనకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా స్థానిక జనసేన కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించారు. న్యాయవాది వృత్తితో పాటు, నూర్ బాషా సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న మహబూబ్ బాషా జనసేనలో చేరడం ఆనందంగా ఉందని వినుత అన్నారు. పార్టీ కోసం కష్టించి పనిచేయాలని, అందుకు తగ్గ గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగరం భాస్కర్ బాబు, పట్టణ అధ్యక్షులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు బిఎస్ఎన్ఎల్ మేళా

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: వరదయ్యపాలెం మండలం, బుచ్చినాయుడు కండ్రిగ రూరల్, సత్యవేడు రూరల్ మండలాల ప్రజల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డ్ వినియోగదారుల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్ మేళా శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ అధికారి వీర రాఘవులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ 3జి సిమ్ నుండి 4జి సిమ్‌కు మారడానికి, బిఎస్ఎన్ఎల్ కొత్త సిమ్‌లు తీసుకోవడానికి, ఇతర నెట్‌వర్కుల నుండి బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి పరిసర ప్రజల సౌకర్యార్థం మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరదయ్యపాలెం లో పోస్ట్ ఆఫీస్ పక్కన బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద, బుచ్చినాయుడు కండ్రిగ ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఈ మేళా నిర్వహిస్తామని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారులు కోరారు.

పారిశుధ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ద్రౌపది దేవి ధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ సమీప ప్రాంతాల్లో పారిశుధ్యంపై పరిసరాలలో జరుగుతున్న పారిశుధ్యపు పనులను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తన సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం తుడా పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ ఇన్‌ఛార్జి సిబ్బంది పార్క్ లో శుభ్రతా ప్రమాణాలు పాటించడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్క్ శుభ్రత విషయం తప్పు చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు సరిగా పనిచేయలేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందడంతో జిమ్ పరికరాలను పరిశీలించారు. రెండు రోజుల్లో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కానుక పంపిణీలో భాగంగా పుత్తూరు పట్టణంలో ఉదయం 5 గంటల నుండి పింఛను లబ్ధిదారులకు కమిషనర్ కెఎల్ఎం రెడ్డి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పుత్తూరు షాప్ స్ట్రీట్, ఆర్‌టిసి కాలనీ, కళ్యాణపురం కాలనీలలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి పుత్తూరు పురపాలక సంఘం పరిధిలో 98.32 శాతం పెన్షన్లు పంపిణి చేసి జిల్లాలో 3 వ స్థానం దక్కించుకుందని తెలిపారు.

నిరుద్యోగ నిర్మూలనకు చేతివృత్తుల తోడ్పాటు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నిరుద్యోగ నిర్మూలనకు చేతి వృత్తులు ఎంతో తోడ్పడుతాయని రాస్ మహిళ భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీ రెడ్డి పేర్కొన్నారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం ఆదేశాల మేరకు రాస్ మహిళాభారతి పాపానాయుడు పేట బ్రాంచ్ జన శిక్షణ సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో కందాడ , సదాశివపురంలలో ఉచిత టైలరింగ్ శిక్షణ కందాడు శివాలయంలో గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథి బాలాజీ రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో రోజుకు మూడు గంటలు చొప్పున టైలరింగ్ శిక్షణ నేర్చుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే చేతి వృత్తి అన్నారు. కుటుంబంలో , సమాజంలో నిరుద్యోగం తగ్గించడానికి చేతి వృత్తులు సహకరిస్తాయని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం యూనిట్ నిర్వహణకు రాస్ సంస్థ ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ హరిబాబు, క్లస్టర్ లీడర్ కాంతమ్మ, వెంకట కుమార్, మునిపార్థసారథి, కృష్ణవేణి, సుమలత, తిరుపాలు, మహిళలు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు పరామర్శ

పరామర్శిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాల్టీ, రూరల్ పరిధిలో పలువురు వైసిపి నాయకులను తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గురువారం పరామర్శిం చారు. వెంకటగిరి రూరల్ మండలం జంగాలపల్లి పంచాయతీ సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త పాలూరు మనోహర్ అనారోగ్యం గురించి బాధపడుతుండంతో తెలుసుకున్న నేదురుమల్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఇటీవల మృతి చెందిన సీనియర్ వైసిపి నాయకుడు, మాజీ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ , చెలికం శంకర్ రెడ్డి ఉత్తర క్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. వెంకటగిరి రూరల్ మండలం మొగలుగుంటలో ఇటీవల మృతి చెందిన విశ్రాంత విఆర్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు పులి ప్రసాదరెడ్డి , మాజీ వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి, చింతల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని రావిళ్ళ వారిపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రావిళ్ల శ్రీరాములు నాయుడు చిత్రపటానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. గురువారం నిర్వహించిన కర్మ క్రియలకు ఆయన హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే పులివర్తి నాని స్వగ్రామం పులివర్తి వారి పల్లికి చెందిన కె ఆనంద్ నాయుడు మృతి బాధాకరమన్నారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే నాని గురువారం పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా వుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎన్ చిన్నబాబు, తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, రావిళ్ల గిరి నాయుడు, జయచంద్ర నాయుడు, నరసింహారెడ్డి, కేధనంజయ రెడ్డి, తిరుమల నాయుడు, మధు నాయుడు పాల్గొన్నారు.

శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

విద్యార్థి దశ నుండే సమాజ సేవ చేయాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ, ఓర్పు అలవరుచుకుని ప్రజా సేవలో పాల్గొనాలని పుత్తూరు బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి పేర్కొన్నారు. వరల్డ్ స్కార్ఫ్‌డేలో భాగంగా పుత్తూరు కామరాజు నగర్ స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు, రేంజర్ లీడర్ భువనేశ్వరి, సుప్రియ, హేమలత గైడ్స్ లీడర్ శైలజ, రోవర్ జై కుమార్ , జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల కమిటీల ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల పనితీరు, అభివృద్ధి, మంజూరైన నిధులు వినియోగం వంటి వాటి పర్యవేక్షణకు ఎస్ఎంసి (స్కూలు మేనేజ్ మెంటు కమిటీ) ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 8వ తేదీ మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, గురు కులాలలో ఎన్నికల నిర్వహణకు మండల విద్యాధికారులు మునికృష్ణయ్య, కృష్ణయ్య ఎన్నికల నోటిఫికేషన్, విధివిధానాలను విడుదల చేసి ఆయా పాఠశాలల నోటీసు బోర్డులో ప్రకటించారు. ఎన్నికల నియమావళి, నిర్వహణ వంటి ప్రక్రియపై విద్యాధికారులు మండల కేంద్రంలో శిక్షణ, అవగాహన ఏర్పాటు చేశారు. ఈ నెల 8న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచిం చారు. ఈ లోపు ఓటుకు అర్హులైన వారిని గుర్తించి ఓటర్ల జాబితా తయారు చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పోటీలో ఉన్న వారిని ఎన్నుకునేందుకు ఓటర్లు చేతులు పైకెత్తి సమ్మతి తెలపడం, వారి నోటి నుండి పేరును ప్రపోజ్ చేయడం వంటివి ఎన్నికల విధానంలో అవలంబించాలని తెలిపారు. ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను ఎన్నుకొని ఆ సభ్యులు పాఠశాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకోవాలన్నారు. రిజర్వేషన్ ప్రక్రియ విధానంలో బిసి ఓసిలో ఒకరు, ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల అధికారిగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్ని బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఎక్స్ ఆఫీసియో సభ్యులు, కో ఆపరేటివ్ సభ్యులు సైతం ఉండేలా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, సమస్యలు, అనుమానాలు తలెత్తితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

కక్ష సాధింపు చర్యలు అన్యాయం..

సిడిపిఓపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి- వెంకటగిరి: ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్ట్ సిడిపిఓ అంగన్‌వాడీ యూనియన్ లీడర్స్‌పై, అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలని సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కక్ష సాధింపు చర్యలు మానుకోకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సిడిపిఓ ఆగడాల గురించి తిరుపతి జిల్లా పీడీ దృష్టికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ తామన్నారు.

సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తిగా జనసేన ఆధ్వర్యంలో అన్నదానానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండు సర్కిల్‌లో పేదలకు గురువారం మూడో వారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా డొక్కా సీతమ్మ ఎంతో మంది పేదల ఆకలి కడుపులు నింపిందని కొనియాడారు. ఆమె సేవలను గుర్తిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సీతమ్మ కాంటీన్ల ఏర్పాటుకు పిలుపు నివ్వడం హర్షణీ యమ న్నారు. అనంతరం 500 మంది పేదలకు అన్నదా నం చేశారు. ఈ కార్యక్ర మంలో వీర మహిళలు గాయత్రి, శారద, నిర్మల పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

బాలికల వసతి గృహాల అభివృద్ధికి పెద్ద పీట: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్‌సి బాలికల వసతి గృహాల అభివృద్ధికి పెద్ద పీట వేయ నున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఆయన తొట్టంబేడు ఎస్సీ బాలికల నెం.1, 2 వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులకు సరైన తలుపులు లేకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడానికి చూసి విచారం వ్యక్తం చేశారు. వెంటనే బాలికల వసతి గృహాలకు తక్షణ మౌలిక అవసరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు నెలల్లో వసతి గృహాల రూపురేఖలు మారుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచయ్య నాయుడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా గల్లా అరుణకుమారి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -రేణిగుంట: మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి 78వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తమిళనాడు ఊటీ లోని అమర అతిథి గృహంలో ఆమె కుటుంబ సభ్యులతో కలసి జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఆమె కేకు కట్ చేశారు. వేడుకలలో పాల్గొన్న వారు ఆమెకు కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలలో అమర రాజ సంస్థల ఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, అమర రాజా వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, అమర ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రమాదేవి గౌరినేని, గల్లా సిద్ధార్థ్, దేవానంద నాయుడు, రజినీ కుమార్, సుధ యాదవ్, బాలకృష్ణ రెడ్డి, రాజగోపాల్, శివ, గల్లా రాజశేఖర్, మునినాధం పాల్గొన్నారు.

కూతురి పెళ్లికి రండి..

జగన్ దంపతులను ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమ కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి వివాహానికి రావాలని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీవాణి రెడ్డి దంపతులు ఆహ్వానించారు. గురువారం బియ్యపు దంపతులు విజయవాడలోని జగన్ స్వగృహంలో కలిసి కూతురి పెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు.

'పరీక్ష పేపర్ల లీకేజి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల నీట్ యుజీ పరీక్ష, యుజిసి నెట్ వంటి పరీక్షలలో పరీక్ష పేపర్లను అక్రమ మార్గాల ద్వారా లీకు చేసిన లీకేజీ దారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఆర్ఎం జాతీయ నాయకత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రని కలిసి విజ్ఞప్తి చేశారు. పరీక్షకు ముందే పరీక్ష పేపర్లను లీక్ చేయడం ద్వారా కొన్ని లక్షల మంది కష్టపడి చదివిన తెలివైన విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరగటమే కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతారని , అనైతిక మార్గాల ద్వారా అవినీతి కార్యక్రమాల ద్వారా పరీక్ష పేపర్లను లీకు చేసే ముఠాలను , వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకొని సమాజం నుంచి వారిని బహిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఏబిఆర్ ఎస్ ఎం కేంద్ర విద్యా శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ప్రస్తుత చట్టాలను మార్పు చేసి పరీక్ష పేపర్ల లీకేజి దారులపై కఠిన చర్యలు చేపట్టే విధంగా కొత్త చట్టాలను తయారు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ,డిగ్రీ కళాశాలలో, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న కొన్నివేల అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉన్నత విద్యాసంస్థలలో మౌలిక వసతులు రూపకల్పనకు ప్రయోగశాలల ఆధునీకరణకు ,విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కొరకు బడ్జెట్లో ప్రత్యేక నిధులను కేటాయించాలని, ఉన్నత విద్యాసంస్థల పరిశోధక విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ పరీక్ష పేపర్ల లీకేజి దారులను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల ద్వారా నిందితులను గుర్తించి తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి తగినంత బడ్జెట్ కేటాయిస్తామని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ జేపీ సింఘాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివానంద షిండేకర్ పాల్గొన్నారు.

రెక్టార్ పోస్టును భర్తీ చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్నో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న రెక్టార్ పోస్టులు భర్తీ చేయాలని వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావుకు టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మైలారి అశోక్ గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీకాంత్ రెడ్డి రెక్టార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత దాదాపు రెండు సంవత్సరాలకు పైగా ఆ పోస్టులో ఎవరిని నియమించక పోవడం బాధాకరమన్నారు. తద్వారా వర్సిటీలో అకాడమిక్ క్యాలెండర్ ను ప్రారంభించేందుకు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న రెక్టార్ పరిధిలో ఎస్‌సి వర్గానికి చెందిన ఆచార్యులను నియమించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌వియూ ఇన్‌ఛార్జి విసికి వినతిపత్రం అందిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమని వైద్యాధికారులు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవ సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పివి దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగలో ర్యాలీ ప్రారంభించి గాజుల పెళ్లూరు, యానాది కాలనీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, గ్రామస్తులకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అర్ధ గంటలోపు బిడ్డకు ముర్రుపాలు కచ్చితంగా తాగించాలని ముర్రుపాలు రోగ నిరోధక శక్తి ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరు వైజర్ శిల్ప, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్ హెచ్‌పిలు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యర్రావారిపాలెంలో వైద్య అధికారిణి డాక్టర్ లీనాకుమారి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ తల్లి పాలు వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిం చారు. ప్రతి పంచాయతీలో వారం రోజులు పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లి పాలు వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలు వివరిస్తారని పేర్కొన్నారు. గర్భిణులు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి, సీజనల్ వ్యాధులపై తగు సూచనలు, సలహాలు ఇస్తామని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాలాయపల్లి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పోషకాలు అధికంగా ఆ బిడ్డకి అందుతాయని వెంకటగిరి క్లస్టర్ సిడిపిఓ శంషాద్ బేగం పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెరిమిటిలో తల్లిపాలు వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పోషకాలు అధికంగా ఉండి వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No. 40 of 2024
Dwarakacherla Radhakrishna Reddy ...వాది
Vs
D.V.Rathna Kumari & 2 others ...ప్రతివాదులు
To
Duggineni Vani Sudha @ Vani (D.3) W/o Audi Narayana, Near Annamayya Marg, Tirupathi Town and Mandal,Tirupathi Dist.
దావా నోటీసు
పై నెంబరు దావాలో పరిహారం ప్రోనోటు బాకీ నిమిత్తం వాది మీమీద దావ దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తము తే.27-08-2024దికి వాయిదా వేసి వున్నారు. కావున వాయిదా రోజు ఉదయము 10.30 గంటలకు మీరు స్వతహాగాగాని, సంపూర్ణముగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరుద్వారాగాని పై కోర్టులో హాజరై అక్షేపణలు వున్నా యెడల తెలుపుకోవచ్చును. లేనియెడల పై విషయము మీ పరోక్షములో తీర్మానించబడును.
ఇట్లు,
చిల్లకూరు రఘునాథరెడ్డి
వాది తరపు న్యాయవాది

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No. 41 of 2024
Dwarakacherla Rajeswari ...వాది
Vs
D.V.Rathna Kumari & 2 others ...ప్రతివాదులు
To
Duggineni Vani Sudha @ Vani (D.3) W/o Audi Narayana, Near Annamayya Marg, Tirupathi Town and Mandal,Tirupathi Dist.
దావా నోటీసు
పై నెంబరు దావాలో పరిహారం ప్రోనోటు బాకీ నిమిత్తం వాది మీమీద దావ దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తము తే.27-08-2024దికి వాయిదా వేసి వున్నారు. కావున వాయిదా రోజు ఉదయము 10.30 గంటలకు మీరు స్వతహాగాగాని, సంపూర్ణముగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరుద్వారాగాని పై కోర్టులో హాజరై అక్షేపణలు వున్నా యెడల తెలుపుకోవచ్చును. లేనియెడల పై విషయము మీ పరోక్షములో తీర్మానించబడును.
ఇట్లు,
చిల్లకూరు రఘునాథరెడ్డి
వాది తరపు న్యాయవాది

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE, TIRUPATI
E.P.No. 77 /2020,
Arb. No. 151 /2012
Between:
M/s. Shriram Transport Finance Co., Ltd., Tirupati rep., by its S.P.A. Holder Padmaraju Prudvi ... Decree Holder
And:
V. Gajapathi and others ...Judgment debtors
SALE NOTICE TO J.Dr No. 1 U/o XXI, R 66 C.P.C
To
V. Gajapathi, S/o Venkatesahan, Gowdaveedhi, Palamangalam South Village, Narayanavanam Mandal, Tirupati Dist.
Please take notice that the D.Hr filed the above E.P. against you for realization of the award/decree amount in the above Arbitration Case and the above E.P.is posted to your appearance before the above said Hon'ble Court on 22-08-2024 at 10.30 a.m. either in person or through your counsel. In the event of your failure to appear as afore said the matter will be decided as ex-Parte in your absence.
Hearing Date: 22-08-2024
Time: 10:30AM.
(By Order of the Court)
M.N. Mani, B.A.L., B.L.,
Advocate for Petitioner/D. Hr